# తలవొంచిన వీరుడు

కాలింగ్ బెల్ నొక్కగానే, "తలుపు తీసే వుంది" అన్న గొంతు విని తలుపు తోసుకుని లోపలికొచ్చేను. అమ్మ సోఫాలో ఓ ప్రక్కన కూర్చుంది. ఆవిడ వొళ్లో తల పెట్టుకుని రమ కాళ్లు జాపుకుని, ప్రక్కకి తిరిగి పడుకుని టీవీలో హిందీ సీరియల్ చూస్తూ తెలుగులో వ్యాఖ్యానం చేస్తూంటే అమ్మ అమృతాంజనం లాగుంది రమ నుదురికి మర్దన చేస్తోంది.

"ఏమిటి రోగం?" అని అడిగేను శేషపాన్పులాగ చేసుకుని పడుకోడం కొత్త కాదు కాని, ఈ మర్దన నూతన ప్రక్రియ.

"తలనెప్పి" అంది మా ఆవిడ, రమ.

"ఇన్సురెన్స్ పాలసీ నెంబర్లు, ప్రీమియమ్‌లు, కంప్యూటర్ రీడింగ్స్.. నీ ఉద్యోగం అలాంటిది."

"వాటి వల్ల రాలేదు. నీ బయోకెమిస్ట్రీ ప్రభావం" అంది, పొత్తి కడుపు మీద చెయ్యేసి తను గర్భవతినని సౌంజ్ఞ చేస్తూ. పొద్దున్నే డాక్టరు దగ్గిరకెడతానంది. పరీక్ష చేయించుకుని నిర్ధారణ చేయించుకొచ్చిందన్నమాట. ఆ వార్త తాలూకు ఆనందం వల్లనో, టీవీ సీరియల్‌పైన ఏకాగ్రత వల్లనో, ఆ పెయిన్ బామ్ పరిమళ ప్రభావం వల్లనో అమ్మ అలాగ తన్మయత్వంలోనే కూర్చుంది కాని లేచే ప్రయత్నం చెయ్యలేదు. రమ స్త్రీ వాది, అసలు లేవదు.

డైనింగ్ టేబుల్ మీద నా కోసం సిద్ధం చేసి వుంచిన ఫలహారం, కాఫీ ఫ్లాస్కు వగైరాలుంచిన ట్రేని యధాతథంగా తెచ్చుకుని టీపాయ్ మీద పెట్టుకుని నేను కూడా హాల్లో కొచ్చి కూర్చున్నాను. టీవీ సీరియల్ అయిపోయింది. రిమోట్ కంట్రోల్‌తో ట్యూన్ చేస్తుంటే ఓ ఛానల్లో "అత్తా లేని కోడలుత్తమురాలు! ఆ.... హుఁ, కోడలు లేని అత్త గుణవంతురాలు! ఆ.. హుఁ" అన్న దంపుళ్ల పాట అప్పుడే అయిపోయింది.

"పాట చాలా బాగుంది. ఎవరు పాడేరో కాని" అన్నాను ఫలహారం చేస్తూ.

"రాగం బాగానే వుంది కాని ఆ భావం అవుట్ డేటెడ్" అంది రమ.

"జీవిత సత్యం మధనం చెయ్యగా ఉద్భవించిన జానపదసాహిత్యమది" అన్నాను.

"ఒకనాడు జీవిత సత్యాలె కావుచ్చు. ఇప్పుడు రోజులు మారేయి. ఎక్కడ చూసినా కోడళ్లను హింసిస్తున్న అత్తల గురించి వింటున్నాం కాని, అత్తల్ని హింసించిన కోడళ్ల కనబడరు" అంది రమ.

"కోడళ్లలకి నోరుంటుంది కాబట్టి వాళ్లగోడు వినబడుతుంది. అత్తలు మూగజీవులు మౌనంగా సహిస్తారు. అంచేత బయట పడరు" అన్నా, అమ్మ కేసి చిరునవ్వుతో చూస్తూ.

"ఒరేయి! సీనూ! నువ్వు నోరు మూసుకుతిను" అంది అమ్మ.

"నోరుమూసుకుని తినడమెలాగ! అన్నాను, అదే పోజులో.

"నోరు తెరిచి ఆ దురాలోచనలు బయట పడేసి మనస్సు క్షాళన చేసుకుంటే తిన్నది వంటబడుతుంది. మీ సుపుత్రుణ్ణి వాగనివ్వండి. అయినా మీ రెందుకు భుజాలు తడుముకుంటారు!" అంది అమ్మ కేసి తిరిగి.

"భుజాలు తడుముకోడానికి నా చేతులు కాళీగా వుండనిచ్చేవు కనకనా!" అంది అమ్మ, రమ చెంప మీద మృదువుగా దెబ్బ వేస్తూ.

"అంతే లెండి, కొడుకంటే కడుపుతీపి. కోడలెప్పుడూ పరాయిదే కదా!"అంది రమ.

ఇంతలోకే టెలిఫోన్ రింగవడంతో రమకేసి తిరిగి "నీకే అయి వుంటుంది, నాకీ టైంలో ఫోన్లు రావు" అన్నా వెళ్లిచూసుకోమని రమకి సౌంజ్ఞ చేస్తూ.

"అయినా వెళ్లి చూడకూడదూ! నేను కాస్సేపు సుఖంగా పడుకుంటే నీకు కడుపు మంట" అంటూ లేచి నా నెత్తిన ఓ మొట్టుకాయ వేసి డ్రాయింగ్ రూంలోకి వెళ్లింది.

"పాపం! నువ్వెళ్లి చూడకూడదు! అసలే నీరసంగా వుంది. పొద్దున్న నువ్వెళ్లింతర్వాత రెండుసార్లు వాంతి చేసుకుంది. లేడీ డాక్టర్ దగ్గిరకెడితే పరీక్షచేసి రమ కడుపుతో వున్నట్టు చెప్పింది. రమే నీకు చెబుతుంది. నీకు చెప్పేనని తెలిస్తే నామీద విరుచుకుపడుతుంది" అంది అమ్మ రహస్యం చెబుతున్నట్టుగా. నవ్వి వూరుకున్నాను. రమంటే అమ్మకి వాత్సల్యమే కాదు, ఆరాధనా భావంతో కూడుకున్న భయం కూడా వుంది. చదువుకుని ఉద్యోగం చేస్తున్న కోడలనే కాదు, రమ సాక్షాత్తూ రాఘవరావుగారి కూతురు.

మాకు పెళ్లయ్యి మూడేళ్లయింది. రమ యల్. ఐ. సి. లో డైరెక్ట్‌గా రిక్రూటయిన ఆఫీసరు. నేను ఓ పెద్ద మందుల కంపెనీలో బయోకెమిస్ట్‌గా పని చేస్తున్నాను. మాది లవ్ మేరేజ్.... అంటే రమ నన్ను ప్రేమించి తన తండ్రి రాఘవరావుగారిని మా పెళ్లికి ఒప్పించింది. రమకి ఆ ఆభిజాత్యం లేకపోలేదు. వాదనలో ఓడిపోయినా ఓప్పుకోదు. అందుకే రమని వాదనలో రెచ్చగొట్టడం, శృతి మించితే నోరు మూయించడం నాకు సరదా.

రమ ఫోన్లో మాట్లాడి తిరిగొచ్చింది. ఫోన్ ఎవరి దగ్గిర్నుంచని నేనడగలేదు. అడిగే అలవాటు అమ్మకి లేదు.

"ఫోన్ నీకే వొచ్చింది. మా నాన్నగారు బాపట్ల నుంచి ఫోన్ చేసేరు. నువ్వింకా యింటికి రాలేదని అబద్ధమాడేను. మా అమ్మ వొచ్చే శనివారం కాక ఆ పై శనివారం లక్ష వత్తుల నోము చేసుకుంటుందిట. అంచేత గురువారం బయల్దేరి మనం వెడితే ఆదివారం బయల్దేరి తిరిగొచ్చేయొచ్చునని నీకు చెప్పమన్నారు. రిటర్న్ టిక్కట్లు ఆయన రిజర్వ్ చేయిస్తున్నారు. వెళ్లడానికి టిక్కట్లు ఫేక్టరీ నుంచి తిరిగొచ్చే టప్పుడు నువ్వు చేయించు, మరిచిపోకు" అంది.

"నీ ఒక్కర్తికే కదా! రేపు చేయిస్తాను" అన్నాను.

"టిక్కట్లు అన్నాను. వినబడలేదా! మన ముగ్గురికీను. అక్కడ మీ అన్నయ్యగార్నీ ఒదినగార్నీ స్వయంగా వెళ్లి పిలుస్తామన్నారు. అంచేత మా అమ్మ వ్రతం మీద భక్తితో కాకపోయినా బాపట్ల వొస్తే వాళ్లనీ చూడొచ్చు, సంతోషిస్తారు."

"పదిహేను రోజుల్లో మా ఫేక్టరీ చూడ్డానికి అమెరికన్ సైంటిస్ట్‌లొస్తున్నారు. మా అత్తగారి లక్షవత్తుల నోమంటే సెలవు..."

"బాబూ! హరిశ్చంద్రా! నువ్వు రావద్దులే. నేనూ అత్తయ్యగారూ వెడతాం". అంది రమ.

"మరి నా తిండీ తిప్పలు... !" అడిగేను.

"ఇదేమీ సహారా ఎడారికాదు. అన్నీ వున్నాయి. ఓపికుంటే వంట చేసుకో. లేకపోతే హోటళ్లున్నాయి" అంది రమ.

★ ★ ★

నేను యస్సెస్సెల్సీ చదువుతుండగా మా అన్నయ్య బియస్సీ పేసై పై చదువుల సంగతి ఆలోచిస్తున్నాడు. సరిగ్గా అదే సమయంలో గుండె జబ్బంటే మా నాన్నని హాస్పటల్లో చేర్చేం. ఆపరేషనన్నారు. చేసేరు. పది రోజుల్లో పోయేడు. మా నాన్న ప్రోవిడెంటు ఫండుతో బాటు మా అమ్మకున్న కొద్దిపాటి నగలు, మా పాత యిల్లు తనఖా పెట్టి అప్పు తెచ్చిన సొమ్మంతా గంగపాలైంది.

క్లర్క్‌గా మా నాన్న పనిచేస్తున్న కాలేజీకి రాఘరావుగారు ప్రిన్సిపాల్. మా నాన్న మీద వున్న అభిమానంతో, గవర్నింగ్ బాడీకి నచ్చజెప్పి ఆ క్లర్క్ వుద్యోగం మా అన్నయ్య

కిప్పించేరు. నేనైనా పెద్ద చదువు చదివి, పైకొచ్చి అప్పులు తీర్చికుటుంబ గౌరవం కాపాడాలన్న వుద్దేశ్యంతో అన్నయ్య ఇంటర్ అయింతర్వాత పట్టుపట్టి పై చదువుకి నన్ను హైదరాబాద్ పంపేడు. మా అన్నయ్య గొర్రె తోక ఉద్యోగం, పెరుగుతున్న అప్పు, వడ్డీ, నా సిటీ చదువు దృష్టిలో వుంచుకుని మా అమ్మ ఆ యింటా, ఈ యింటా వంటలు చేస్తూ వేణ్ణీళ్లకు చన్నీళ్లుగా మా అన్నయ్య సంపాదనకి తన సంపాదన జోడించి, గుట్టుగా సంసారం బండి నడిపిస్తూ వొచ్చింది.

మధ్య మధ్య రాఘవరావుగారింట్లో కూడా ఏదైనా వంట పని వుంటే చేసిపెట్టేది. వాళ్లు కూడా గౌరవంగా చూసేవారు. రాఘవరావుగారి తమ్ముడు కృష్ణమూర్తిగారు హైదరాబాద్‌లో పెద్ద ఎడ్వొకేట్. ఆయన ఎప్పుడో ముస్లిం జాగీర్‌దార్ దగ్గిర పెద్ద కాంపౌండున్న బంగళా కొన్నారు. రాఘవరావుగారు వుత్తరం రాయడంతోనే ఆయన కారు షెడ్‌ప్రక్కనే శిధిలావస్థలో వున్న అవుట్ హవుస్ బాగుచేయించి యిచ్చేరు. నేను అందులోనే వుండివొండుకు తింటూ చదువుకునే వాణ్ణి. అయిదేళ్ల క్రితం ఆయన యింటిని రీమోడల్ చేయించుకుంటున్న సందర్భంలో నేనుండే అవుట్ హవుస్‌ని కొత్త సౌకర్యాలు సమకూర్చి అందంగా తయారుచేయించి, నన్ను వాళ్ల కుటుంబంలో మనిషిలాగే అభిమానిస్తూ నేను యెమ్మెస్సీ బయోకెమిస్ట్రీ పేసై ఉద్యోగంలో చేరేక కూడా అందులోనే వుండమని నిర్బంధం చేసేరు.

నేను ఉద్యోగంలో చేరిన మూడేళ్లకి రమ బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సు పేసై డైరెక్ట్ రిక్రూట్‌గా హైదరాబాద్‌లో యల్.ఐ.సీలో చేరింది. అప్పట్నుంచి పినతండ్రిగారి బంగళాలో రమ మకాం, అవుట్ హవుస్‌లో నేను. వరసగా రెండ్రోజులు శలవొస్తే బాపట్ల వెళ్లేవాణ్ణి. రమ కూడా బయల్దేరేది. ప్రయాణంలో ఆమెకి తోడుగా వుండటం నాకు పరిపాటయింది. అలా మొదలైన ప్రయాణాల్లో మా పరిచయం ప్రణయంగానూ తర్వాత పరిణయంగానూ పరిణమించింది. మా ఆర్థిక పరిస్థితులు తెలిసిన రాఘవరావుగారు ముందు సంకోచించినా రమ పట్టుదలని, కృష్ణమూర్తిగారి అభిప్రాయాన్ని గౌరవించి ఆమోదించేరు, తర్వాత అభినందించేరు. మా పెళ్లి కట్నం, కానుకలు ప్రమేయం లేకుండా నిరాడంబరంగా జరిగి పోయింది.

మా పెళ్లి అవ్వకముందే రాఘవరావుగారు నాలుగు లక్షలు పెట్టి ఒక త్రీ బెడ్‌రూం ఫ్లేట్ కొని, అన్ని సదుపాయాలూ సమకూర్చి రమ పేర రిజిస్టర్ చేసేరు. పెళ్లయ్యేక మేమందులోనే గృహప్రవేశం. నేను యమ్మెస్సీ ఫైనలియర్‌లో వుండగా మా అన్నయ్య పెళ్లయింది. మా వొదిన కూడా చాలా సామాన్య కుటుంబంలోంచి వొచ్చిన దూరపు

బంధువుల అమ్మాయే. బియ్యే పేసయింది. పుట్టింటారు నెల్లూరు. పెళ్లి ముందర నెల్లూరులోలాగే పెళ్లయిన తర్వాత బాపట్లలో కూడా పిల్లలకి ట్యూషన్లు చెబుతూ కొద్దిగా సంపాదిస్తుంది.

మా యిద్దరి నెలసరి సంపాదన ఒకే స్థాయిలో వుంటూ వొచ్చేయి. నిజానికి నా జీతమే కొంచెం ఎక్కువ. రమతో సంప్రదించి మా యింటి దగ్గరే వున్న బేంక్‌లోనే జాయింట్ ఎకౌంట్ పెట్టుకున్నాం. ఎవరికి కావల్సింది వాళ్లు తీసుకోవడమే కాని ఒకరి ఖర్చులనొకరెన్నడూ ప్రశ్నించుకోలేదు. మధ్య మధ్య ఫిక్సెడ్ డిపాజిట్లనీ, మ్యూచువల్ ఫండ్సనీ, బాండ్సనీ, టాక్స్ సేవింగ్ స్కీమ్స్ అనీ రమ మా యిద్దరి పేరా ఇన్వెస్ట్ చేస్తూ వుంటుంది. ఖరీదైన వస్తువులు కొనుక్కునే ఖర్చు మా కుండదు. మేమేదైనా వస్తువు కొనాలనుకునే లోగానే ఆ వస్తువు మా అత్తారు తీసుకొచ్చి యింట్లో పెట్టడమో, పంపడమో జరుగుతుంది. రమ అన్నగారు ఇరాన్‌లో ఓ ఆయిల్ రిఫైనరీలో ఇంజనీరుగా నాలుగేళ్లబట్టి పనిచేస్తూ సకుటుంబంగా అక్కడే వుంటున్నారు. ఏడాది కోసారి వొచ్చినప్పుడు రకరకాల వస్తువులు తీసుగొచ్చి పడేస్తూ వుంటాడు.

మా పెళ్లయి రెండేళ్ల వరకూ మా చిన్న కుటుంబంలో ఏ చింతలూ లేవు. గత ఏడాదిగా మా అమ్మ ధోరణిలో మార్పు కనబడుతూ వొచ్చింది. రమ యింట్లో లేనప్పుడు నాతో ఏకాంతంగా, "ఏమిటో రా! బాపట్లలో మీ అన్నయ్య ఏమి యిబ్బంది పడుతున్నాడో! ఇల్లరికం అల్లుడులాగా నీకేలోటు రాకుండా చూసుకొనడానికి కామధేనువు లాంటి మీ అత్తమామలు, కల్పవృక్షం లాంటి మీ బావమరిదీ వున్నారు. ఇంటి చాకిరీకి నేనున్నాను. వాడే పాపం! ఆ చిన్న ఉద్యోగంలో కూరుకుపోయేడు. పెళ్లయ్యేకైనా, నాలుగు రాళ్లు వెనకేసి సుఖ పడతానుకోడానికి వాడి పెళ్లామేమీ ఆస్తి మూటకట్టుకు రాలేదు. ఉద్యోగం లేదు. పోనీ వెనుకటిలాగే నేనక్కడికెళ్లి నాలుగిళ్లల్లో...." అంటుండేది అమ్మ.

"అమ్మా! మళ్లీ నువ్వామాట అనకు. ఇంక నీకా అవసరం లేదు. నా బాధ్యత నాకు తెలుసు. నేను ఉద్యోగంలో చేరినపప్పట్నుంచీ ఇంతవరకూ నేను అన్నయ్యకి...." అంటూ లెక్కలు చెప్పేవాణ్ణి.

"చాలా పంపించేవు. నాకు తెలుసు. ఇంటి అప్పు తీరిపోయింది. ఇల్లు మరమ్మత్తు కూడా చేయించేవు. నా నగలు తాకట్టు విడిపించేవు. ఇంక నువ్వు పంపినా తీసుకోడానికి వాడికి మొహమాటం. పైగా అన్ని విషయాల్లోనూ రాఘవరావుగారిని సంప్రదించే, చేస్తూ వుంటాడు. అందుకే యింక ప్రతీ నెలా డబ్బు పంపొద్దని వుంటాడు."

"అదే నమ్మా సమస్య. రమా తండ్రీ ఏం కూడబలుకున్నారో తెలీదు. ఇంక ఆ చిన్నపాత కొంప మీద పెట్టి డబ్బు ఎందుకు తగలేస్తావు!' అని రాఘవరావుగారన్నారుట. అప్పట్నుంచీ అన్నయ్య ఇంక డబ్బు పంపిస్తే తిరగ్గొట్టేస్తానని మందలించేడు. అన్నయ్య నాకు తండ్రిలాంటివాడు. నేనేదో పథకం ఆలోచిస్తానుగా!" అంటూ సముదాయిస్తూ వొచ్చేను.

ఇటు రమ, అటు మా వదిన ఒకేసారి గర్భవతులయ్యేరు. మా వదినకి నెల్లూరులోనూ, రమకి బాపట్లలోనూ వాళ్ల తల్లిదండ్రుల తాహతుని బట్టి సీమంతాలు జరుపుకున్నారని వెళ్లివొచ్చిన అమ్మ చెప్పింది. రమ మెటర్నిటీ లీవ్ మీద బాపట్ల వెళ్లింది. పది రోజులు పోయిన తర్వాత, "నేను బాపట్లవెళ్లి అన్నయ్య దగ్గిరుంటాను. రమని కూడా చూస్తూ వుండొచ్చు. మీ వొదిన్ని వెళ్లి చూడాలంటే అక్కడికి నెల్లూరు దగ్గిర" అంది అమ్మ. సరే అన్నాను.

"నువ్వు డబ్బు పంపి విడిపించిన నా నగలెక్కడున్నాయి?" అడిగింది.

అమ్మకి నాలుగు కాసులు గొలుసు, నాలుగు తులాల బంగారు గాజులు వున్నాయి. అన్నయ్య పట్టుకొచ్చి అమ్మకిచ్చేడు. "ఒక్కర్తినీ యింట్లో వుంటాను. రోజులు బాగాలేవు. నేనేమీ పెట్టుకోను. జాగర్తగా దాచు" అని వాటిని అమ్మ నాకిచ్చింది. రమకిచ్చి లాకర్‌లో పడెయ్యమన్నాను. పడేసింది. ఆ విషయం అమ్మకి చెప్పేను.

"అది కాదురా! వాటిని తెచ్చెయ్యి. మీ వొదినకిచ్చేస్తే నాకు తృప్తిగా వుంటుంది." అంది.

"తప్పకుండాను. తెచ్చిన రోజునే అన్నకిచ్చెయ్యవల్సింది." అన్నాను. నాకు మల్లేనే అన్నయ్యకీ ఓ మంచియిల్లు, స్కూటరు, టి.వి., ఫ్రిజ్ లాంటి వన్నీ వుండాలని అమ్మకి అనిపించడం సహజం.

"రమ వుండగా యిచ్చేడు. నీ ప్రయోజకత్వాన్ని మెచ్చుకుంటూ నా నగలు నాచేతిలో పెట్టేడు. అది ధర్మం. నాకక్కర్లేదు మీ ఆవిడకి వుంచుకో అంటే వాడి ఆత్మాభిమానాన్ని చంపుకుని 'సరే' అంటాడా! నేనిచ్చే విధంగా నేనివ్వాలి" అంది అమ్మ.

పొద్దున్నే లాకర్ కీ కోసం వెతికేను. కనబడలేదు. వెంటనే రమకి ఫోన్ చేశాను.

"నా దగ్గిర వుంది ఏఁ"అంది.

"అమ్మ నగలు..."

"అవిడ పెట్టుకోటం లేదుకదా! అవి చెరిపించి..."

"అవిణ్ణి అడగక్కర్లేదా!"

"అక్కర్లేదు. అత్తయ్య నా మాటకాదనరు. నేను ఆలోచించే తెచ్చాను.."

"కొన్ని విషయాలు తలతో కాదు హృదయంతో ఆలోచించాలి. నీకర్థం కాదు అనుభవంలేదు..." అన్నాను ఓ చురక తగిలిస్తూ.

"అత్తయ్య అక్కడున్నారా? నేను మాట్లాడతాను...."అంది.

"ఏమిటి మాట్లడతావు? మాట్లాడింది చాలు!" అని పెట్టేశాను రిసీవర్.

అమ్మ వింది. అర్థం చేసుకుంది. అక్కడ తండ్రితో చెప్పి అన్నయ్య డబ్బు తీసుకోకుండా చేయించింది. ఇక్కడ అమ్మ నగలు చెరిపించి సొంతం చేసుకుంటోంది. అమ్మని యిక్కడ హోల్ టైం సర్వెంట్ మెయిడ్‌గా ఉపయోగించుకుంటోంది. నేను కట్నం అడగలేదు. ఆశించలేదు. ఆయన యివ్వగలనని యిచ్చినట్లయితే అదంతా అప్పుల కిందజమ కట్టేస్తామని భయం అనుకుంటా. ఇంత వరకూ నేను తీర్చిన అప్పుకు బదులు ఈ నగలు కాజేసిందన్నమాట! అంతా ఆలోచించే తెచ్చేసుంటుంది. అంటే లాకర్ తెరిచి అమ్మ తన నగలు ఎక్కడ పట్టికెడుతుందోనని భయమన్నమాట!

"ఒరేయి శీనూ! ఎలా జరిగేది అలా జరుగుతుంది. వాడంతే పెట్టి పుట్టేడు. ఇప్పుడు నువ్వు రమతో గొడవపెట్టుకోకు. ఉత్తమనిషి కూడా కాదు. తండ్రితో సంప్రదించే వుంటుంది. వాళ్లు పెద్దవాళ్లు. వాళ్లపద్ధతులు వాళ్లవి. ఇంకావిషయంలో రభస చెయ్యకు" అంది అమ్మ.

"సమయంరానీ. నీ నగలతో బాటు రమ నగలు కూడ నీకిస్తే ఎవరడ్డం వస్తారో చూస్తా" అన్నాను ఉక్రోషంతో.

"మళ్లీ నువ్వు నా నగలు మాటెత్తుతే నీ గడప తొక్కను" అంది అమ్మ వెళ్లబోయే ముందు వార్నింగిస్తూ.

ఆనాటి నుంచీ రమతో ఫోన్లో ముభావంగా వుంటూవొచ్చేను. నా ధోరణి గ్రహించిన రమ కూడా ముక్తసరిగానే మాట్లేదేదు.

రమ మొగపిల్లవాణ్ణి ప్రసవించినట్లూ, మరో వారం తర్వాత మా వదిన ఆడపిల్లను కనినట్లు ఫోన్లు వొచ్చేయి. నిజం చెప్పొద్దూ మా అన్నయ్యకి మొగపిల్లవాడు, మాకు ఆడపిల్ల పుట్టి వుంటే పది రెట్లు సంతోషించేవాణ్ణి. భగవంతుడికి కూడా డబ్బున్న వాళ్ల

పట్ల ఈ పక్షపాతమేమిటో! అన్నయ్య జీవన సమరంలో యోధుడు. ఇలాంటి ఆలోచనలకు అతీతుడు. అమ్మకి మాత్రం అన్నయ్యకి ఆడపిల్లలంటే ఆశాభంగమే. మధ్య మధ్య రమని చూడటాని కెళ్లినప్పుడు, అక్కడ నుంచి రమతో బాటు తనూ టెలిఫోన్లో మా బాబుని గురించి మాట్లాడుతూ ఆనంద తన్మయత్వంలో మునిగిపోయి మా అన్నయ్య కూతుర్ని గురించి మాట్లేడేటప్పుడు ధోరణి వేరుగా వుండేది.

మా మావగారు బారసాల ముహూర్తం సంగతి ఫోన్ చెయ్యగానే ముందు మా అన్నయ్య బిడ్డకి, తర్వాతే మా చంటాడికి అని చెప్పేను. మా అన్నయ్యతో సంప్రదించినట్లున్నారు. మా అన్నయ్య కూతురికి పదకొండో రోజున నెల్లూరులో, మూడు రోజుల తర్వాత ఇరవై ఒకటవ రోజున మా చంటాడికి బాపట్లలోనూ బారసాలనీ, ముందుబాపట్ల వచ్చి అక్కడ ఒక రోజుండేటట్లు వొస్తే యిద్దరం కలిసి వెడదామని అమ్మ ఫోన్ చేసింది. అక్కడే వున్న మా అత్తమామలు కోరస్‌లో ఆహ్వానించేరు. మా అన్నయ్యకీ వదినకీ చంటిపిల్లకీ పీటల మీద పెట్టవల్సిన బట్టలు తెప్పించి వుంచినట్లూ, నేను కొనక్కర్లేదనీ రమ ఫోన్ చేసింది. సరే అన్నాను.

కొనేవేవో బాపట్లలోనే అమ్మని సంప్రదించి కొనొచ్చునని బేంక్‌కి వెళ్లి ఇరవై వేలు డ్రా చేసి బాపట్ల బయలుదేరి తిన్నగా మా యింటికెళ్లేను. భోం చేసింతర్వాత మా అత్తారింటికెళ్లి రమని పలకరించి చంటాణ్ణి చూసి రమ్మని అమ్మ తరిమింది.

మా వంశోద్ధారకుడు హంసతూలికా తల్పంమీద శయనించివున్నాడు. ప్రక్కనే వున్న మంచం మీద రమ పడుకుని వుంది. రమకేసి చూశాను. రెండు నెలల తర్వాత కల్సుకున్నాం. ఇన్నాళ్లు ఎప్పుడూ విడిచి వుండలేదేమో మేమిద్దరం రెండు క్షణాలు మౌనంగా వున్నాం. నెమ్మదిగా ప్రక్కన కూర్చున్నాను.

"జ్ఞాపకం వున్నానా!" అంది.

"మరిచిపోతే కదా!" అన్నాను.

"రెండు నెలల్నుంచీ మమ్మల్ని చూడాలనిపించలేదన్న మాట!"

"ఫోన్లో మాట్లాడుకుంటున్నాం కదా!"

"అత్తయ్య రోజూ మధ్యాహ్నం వొచ్చి సాయంత్రం వరకూ వుంటున్నారు!"

"మరి మనవడంటే ముద్దు కదా!"

"ఆవిడకి కోడలన్నా ముద్దే!"

"అలాగా! మరి కోడలికి అత్తంటే.. అడగొద్దు-చెప్పొద్దు. అవునా!"

"అడగడం చెప్పడం నాకు రాదు. చెయ్యడమే తెలుసు" అంటూ మంచం కింద వుంచుకున్న బ్రీఫ్‌కేస్ తెరిచి, అందులోంచి ఓ కాగితాల కట్ట, వెండి భరిణ తీసి, కాగితాలు నా చేతికిచ్చి చూడమంది. కాగితాలు చూశాను. నిర్ఘాంతపోయేను. మూడు వందల యాభై గజాల స్థలం మా మామగారు మా అమ్మపేర రిజిస్టర్ చేశారు. కనీసం యిప్పుడు గజం వెయ్యి రూపాయలుంటుంది. పైగా రెండేళ్ల క్రితమే రిజిస్టర్ చేసేరు.

"ఏమిటిది?"

"ఈ స్థలం ఎప్పుడో మా నాన్నగారు ఇరవై యేళ్ల క్రితం కొన్నారు. సద్వినియోగం చేసేరు."

"ఇదెందుకు?"అడిగేను.

"మీ పాత యిల్లు అమ్మేసి ఆ డబ్బెట్టి ఈ స్థలంలో కొత్త యిల్లు కట్టుకోడానికి. ఉత్తరోత్తరా ఆ యిల్లు మీ అన్నయ్యకు చెందుతుంది."

"ఎందుకు కలిగిందీ ఆలోచన?"

"ఆ పాత యింటికి మరమత్తు చెయ్యడం డబ్బు దండగని నేనూ నాన్నగారూ ఆలోచించాం."

"అమ్మ ఒప్పుకుంటుందా?"

"నా మాట కాదనదు. మీ అన్నయ్య మా నాన్నగారి మాట కాదనరు. నీ మాట నాకు లెక్క లేదు."

"ఎంచేత?"

"నువ్వు వుత్త బడుద్దాయివి. నిన్నడిగి ప్రేమించేనా! నిన్నడిగి పెళ్లాడేనా! నీకన్నీ సంకోచాలే. అన్నీ నా యిష్టప్రకారమే జరిగేయి.

"రెండేళ్ల నుంచీ నా దగ్గిర ఈ విషయం ఎందుకు దాచేవు?"

"మీ అన్నయ్యకి డబ్బు పంపుతున్నట్లు నాకు చెప్పేవా? నిన్ను పెంచి చదువు చెప్పించి ఇంతవాణ్ణి చెయ్యడానికి మీ అమ్మా, అన్నయ్యా ఎంత త్యాగం చేశారో నీకే తెలుసుననుకున్నావు!"

"నేనలా అనుకున్నానని ఎందుకనుకున్నావు?"

"ఫోన్‌లో మీ అమ్మ నగలు గురించి అడిగినప్పుడు నా సమాధానం కూడా వినడానికి నిరాకరించిన వీరుడివి" అంటూ ఆ భరణి తెరిచి ధగధగ మెరిసే నగలు బయటకుతీసి, "అత్తయ్య నగలు చెరిపించి మరో నాలుగు వేలు వేసి కొత్తవి చేయించేను. ఇవి మీ వొదినకిమ్మంటాను. ఇదిగో ఆరువేలు పెట్టి మీ అన్నయ్య కూతురికి గొలుసు... ఇటు చూడు.... ఎంత బాగుందో!" అంటుంటే నేను ఆ నగలకేసి చూడటం లేదు, రమ విశ్వరూపం కేసి చూస్తున్నాను.

రమ నా జుట్టులోకివేళ్లు జొనిపి గట్టిగా పట్టుకుని, "నాకు తలతోనే కాకుండా హృదయంతో కూడా ఆలోచించడం తెలుసునని నమ్మకం కుదిరిందా!" అంటూ నా తలని తన మొహం మీదకి వొంచుతుంటే, "నా జుట్టు పట్టుకుని జీవితాంతం ఇలాగే నడిపించు" అనుకుంటూ తల క్రిందకి వొంచేను.

** రచన, 1997 ఉగాదికి ప్రత్యేక సంచిక*